జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీ..మీ.. మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

ఆదివారం | 12-04-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 641 పేజీలు: 4 వెల: రూ.7

బంగారం కుదువ పెట్టారు..

-బోరుభద్రలో వడ్డీ వ్యాపారి పరారీ
-రూ. కోటికి పైగా బంగారం, నగదుతో ఉడాయించిన ప్రబుద్ధుడు
-లబోదిబో మంటున్న బాధితులు

బోరుమన్నారు!

సంతబొమ్మాళి, ఏప్రిల్ 11 (వార్త): ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని కోటి రూపాయలకు పైగా తాకట్టు పెట్టిన బంగారం, నగదుతో ఓ వడ్డీ వ్యాపారి పరారైన ఉదంతం ఇది. సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో ఈ సంఘటన చోటు చేసుకుంది. బోరుభద్ర గ్రామంలో పోలాకి మండలం పిన్నింటి పేటకు చెందిన పొట్నూరు కృష్ణారావు 30ఏళ్ల క్రితం నుంచి వెంకట భగవాన్ మెడికల్ షాప్ నడుపుతున్నాడు. మెడికల్ షాప్ లో మందులు అమ్ముతూ, చాలా కాలం నుంచి వడ్డీకి, బంగారం వస్తువులు తనఖాగా ఉంచుకుని అప్పులు ఇస్తుండేవాడు. అయితే కొన్నేళ్లు క్రితం తన సమీప బంధువు, పరుసకు కుమారుడైన పొట్నూరు నానిని బోరుభద్ర తీసుకు వచ్చి తన మెడికల్ షాప్ వ్యాపారం అప్పగించాడు. కృష్ణారావు తన మకాం సరసన్న పేటకు మార్చి అక్కడ వేరే వ్యాపారాలు చేస్తూ..అప్పుడప్పుడు బోరుభద్ర వచ్చి షాప్ లెక్కలు చూసి వెళ్లిపోయేవాడు. అయితే అప్పటి నుంచి బంగారం వస్తువుల తనఖా వ్యాపారం నాని కొనసాగిస్తూ అందరితో నమ్మకంగా మెలిగేవాడు. అయితే కొద్ది రోజులుగా బంగారం తనఖా పెట్టిన వారు డబ్బులు తీసుకు వచ్చి తమ వస్తువులు ఇవ్వమని అడగగా వేరేవారి వద్ద ఉన్నాయని తిప్పుతున్నాడు. మరికొంతమంది వద్ద డబ్బులు తీసుకొని నెలల కావస్తున్నా బంగారం తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడంతో బాధితులు గట్టిగా నిలదీయగా, మెడికల్ షాప్ నకు తాళాలు వేసి గురువారం నుంచి నాని పరారయ్యాడని గ్రామంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. నాని ఈ ప్రాంతంలో రూ.30లక్షల వరకు అప్పులు చేశాడని, కొందరి వద్ద నెలకి నూటికి పది రూపాయల వరకు వడ్డీకి అప్పులు వాడాడు. ఆ డబ్బులతో పాటు తనఖా పెట్టిన 50తులాల బంగారం వస్తువులతో పరారు కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితుల్లో బోరుభద్ర, గొదలాం, మలగాం, కుముందువాని పేట, పాలతలగాం, శిమ్మయ్యపేట, కొల్లిపాడు, గెద్దలపాడు, పిట్టవానిపేట, పాత మేఘవరం వారు ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాంతంలో ఎప్పుడు ఇటువంటి సంఘటన జరగకపోవడంతో ఎక్కడ చూసినా బంగారంతో ఉడాయించిన వ్యాపారి ఉదంతమే చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది బాధితులు పోలీసులకు సమాచారం అందించారని తెలిసింది. ఈ విషయం సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలంను అడుగగా.. రాత పూర్వకమైన ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

సంతబొమ్మాళి, ఏప్రిల్ 11(వార్త): నౌపడకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ భర్త కర్రి విష్ణుమూర్తి, ఆయన అనుచరుడు అనపాన నగేష్, అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, సదాశివ.. మరికొందరు టీడీపీ కార్యకర్తలు పరస్పరం శనివారం దాడులు చేసుకున్నారు.

నౌపడ గ్రామానికి చెందిన అనపాన నగేష్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చేయి అడ్డుపెట్టి ఉమ్మి రోడ్డుపై వేయగా, అది ద్విచక్ర వాహనంపై వెనుకన వస్తున్న సదాశివ కాలిపై పడింది. దీంతో సీతానగరం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆపి కావాలనే తన ఉమ్మి వేశారని, సారీ చెప్పమని సదాశివ కోరారు. తాను చూడలేదని, కావాలని ఊయలేదని సారీ చెప్పనని నగేష్ అనడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇంతలో అక్కడ ఉన్నవారు ఇరువురికి నచ్చజెప్పడంతో వెళ్లిపోయారు. అనంతరం విష్ణుమూర్తి వద్ద పార్టీ కార్యాలయంలో పంచాయితీ పెట్టి, అనపాన నగేష్‌ను పిలిచి ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో మాజీ ఎంపీపీ భర్త కర్రి విష్ణుమూర్తి కళ్లజోడు విరిగిపోగా, కాళ్లకు గాయమై రక్తస్రావం అయింది. దీనిపై నగేష్ నౌపడ పోలీస్ స్టేషన్‌లో సదాశివ, తిప్పాన కామరాజు, కిలుగు సత్యంపై ఫిర్యాదు చేయగా, అనపాన నగేష్‌పై సదాశివ ఫిర్యాదు చేశారు. దీంతో నౌపడ ఎస్ఐ ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.



పూలే ఆశయాలే మా అజెండా

- కేంద్ర మంత్రి రామ్మోహన్

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): మహాత్మ జ్యోతీరావు పూలే ఆశయాలను కూటమి సర్కారు ముందుకు తీసుకువెళ్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని పొన్నాడ బ్రిడ్జి కూడలి వద్ద గల పూలే విగ్రహానికి ఆయన శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే కేవలం ఒక ప్రాంతానికి, ఒక దేశానికి చెందిన వ్యక్తి కాదని.. ఆయన ఆశయాలు రెండు శతాబ్దాలుగా ప్రపంచానికి ఆధారంగా నిలుస్తున్నాయన్నారు. సమాజంలో సమానత్వానికి, వెనుకబడిన తరగతుల్లో విద్య ద్వారా మార్పు కోసం ఆయన చేసిన కృషి నేటి సమాజానికి ఆదర్శం అన్నారు. మహిళల పాఠశాలను ఆనాడే ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటుపడ్డారానికి తెలిపారు.

అనాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు.. పూలే ఆశయాలను కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తు తం రాష్ట్ర ప్రభుత్వ అజెండా పూలే ఆశయాలే అని స్పష్టం చేశారు. అన్ని కులాలకు కార్పొరేషన్ ద్వారా తోడ్పాటు అందిస్తున్నట్టు స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఒక టీసీ అవ్వడం మనందరి అదృష్టం అని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్.సి. బి.సి నేషనల్ కమిషన్‌ను పార్లమెంట్ లో పాస్ చేయించి చట్టబద్ధత కల్పించడం ఎన్డీయే సర్కారు నిబద్ధతకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రజా సంఘాల ప్రతినిధులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌పై రైతులకు అవగాహన కల్పించండి

- రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): పలాస ఎయిర్ పోర్ట్ ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పలాస ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 50 మంది రైతులకు ఒక్కొక్క వీఆర్ఓ చొప్పున ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీఆర్ఓలు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ సభలు ఏర్పాటు చేసినపుడు తహసీల్దార్లు, పోలీసు లకు పలు సూచనలు జారీ చేశారు. వీఆర్ఓల వారీగా ఆయా గ్రామాల్లో ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీఆర్ఓల వద్ద ఎవరికి కేటా యించిన వారి వివరాలు ఉండాలన్నారు. ఈ సమావే శంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, పలాస ఆర్డీఓ ఆర్.అప్పలరాజు, డీఎస్పీ వివేకానంద, సంబంధిత మండలాల తహసీల్దార్లు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

స్పా, మసాజ్ సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ..

కఠిన చర్యలు తప్పవు : డీఎస్పీ

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): స్పా, మసాజ్ సెంటర్ల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం నగర డీఎస్పీ సి.హెచ్.వివేకానంద హెచ్చరించారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో కొందరు వ్యక్తులు స్పా, మసాజ్ సెంటర్ల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న స్పా, మసాజ్ సెంటర్లపై ప్రత్యేక నిఘాతో పాటు తనిఖీలు నిర్వహిస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలా పాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొ న్నారు. స్పా/మసాజ్ సెంటర్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అన్నారు. సంబంధిత పోలీ స్‌స్టేషన్‌కు ముందుగా పూర్తి వివరాలతో సమాచారం ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంబం ధిత సెంటర్లను సీజ్ చేసి, లైసెన్సులు రద్దు చేస్తామ న్నారు. నిర్వాహకులతో పాటు భవనాన్ని అద్దె/లీజుకు ఇచ్చిన యాజమాన్యంపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పా/మసాజ్ సెంటర్లకు తప్పనిసరిగా లైసెన్స్ ధ్రువీకరణ ఉండాలన్నారు. లైసెన్స్, అనుమతుల ధ్రువీకరణను ప్రవేశ మార్గం వద్ద బోర్డులో ప్రదర్శించాలన్నారు. భవన యాజమాన్యం వివరాలు నమోదు చేయాలన్నారు. సెంటర్‌లో పనిచేసే సిబ్బంది (ఆడ/మగ) పూర్తి వివరాలు, ఐడీ ప్రూఫ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్ వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

స్పా/మసాజ్ సెంటర్ల పేరుతో ఎవరైనా అనుమానాస్పద కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. పోలీసు అత్యవసర సేవలు: 112, శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ: 630999 0804, సంబంధిత పోలీస్‌స్టేషన్లకు కూడా సమాచారం అందించవచ్చని ఆయన సూచించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

పూలేకు ఘన నివాళులు

నరసన్నపేట, ఏప్రిల్ 11(వార్త): విద్యా సమానత్వం, స్త్రీ సాధికారత, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసి భారత సమాజంలో సమానత్వానికి బాటలు వేసిన గొప్ప సంస్కర్త, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బలగ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పూలే ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని, ఆయన చూపిన సమానత్వం, విద్యా విస్తరణ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. స్త్రీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన పూలే సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. సమాజంలో సమానత్వం నెలకొల్పడంలో పూలే సిద్ధాంతాలు ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు.

పూలే జీవితం నేటి తరాలకు ఆదర్శం

మందస, ఏప్రిల్ 11(వార్త): మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం నేటి తరాలకు ఆదర్శం అని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.మోహనరావు అన్నారు. శనివారం పూలే జయంతి సందర్భంగా మందసలో అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 శతాబ్దంలో మనువాదం బలంగా రాజ్యమేలుతున్న కాలంలో సాంఘిక అసమానతలను తరిమివేయాలంటే విద్య చాలా అవసరం అని ఆదిశలో విద్య వ్యాప్తి కి అహర్నిశలు శ్రమించారన్నారు. స్త్రీలకు విద్య నిషేధం అని ప్రవచించిన మనుస్మృతిని కూడా తిరస్కరించిన మహానుభావుడు పూలే అని కొనియాడారు. మహాత్మా అని పిలిపించుకున్న గాంధీ కంటే ముందే ఆయన మహాత్మాగా జన నీరాజనాలు అందుకున్న యుగపురుషుడు పూలే అని కొనియాడారు. పూలే ఒక వ్యక్తి మాత్రమే కాదని ఆయన ఒక ఆలోచన, ఒక ఉద్యమం, నేటి తరాలకు దిక్సూచి అని అన్నారు. కార్యక్రమంలో సంఘకార్యదర్శి ఎస్.కాళిదాసు, జె.శాంతారావు, ఎన్.నరసింహమూర్తి, తెప్ప కేశవరావు, ఇప్పిలి చంద్రశేఖర్, జె.కోటేశ్వరరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం

మందస, ఏప్రిల్ 11(వార్త): పేద కుటుంబానికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10000ల ఆర్థిక సహాయం అందించింది. ఇచ్ఛాపురం మండలం చిన్నలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజు, విమల దంపతుల రెండవ కుమారుడు తాన్విక్ కు పుట్టుకతోనే తీవ్రమైన వినికిడిలోపం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. తాన్విక్‌కు కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయాలని వారు తెలిపారు. ఈ సర్జరీ చేయకపోతే బాబు వినలేడు.. మాట్లాడలేడు. సర్జరీ కోసం రూ.36లక్షలు ఖర్చవుతుందని తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి వెంటనే స్పందించి తమ వంతు సహాయంగా రూ.10000లు అందించింది. కార్యక్రమంలో రంజిత్, జోగా రావు, పాపారావు, విష్ణు, శ్రీహర్ష గ్రామస్తులు పాల్గొన్నారు. దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా స్పందించి, ఈ కుటుంబాన్ని ఆదుకుంటారని కోరారు.

సామాజిక వెలుగుల సూరీడు పూలే

సోంపేట, ఏప్రిల్ 11(వార్త): సమాజంలో నెలకొన్న అసమానతలు, నిరక్షరాస్య తను సమూలంగా నిర్మూలించేందుకు నడుం బిగించిన మహావీరుడు జ్యోతిరావు పూలే అని బిజెపి ఓ బి సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దున్న శ్రీనివాసరావు పేర్కొన్నారు. పూలే 199వ జయంతి కార్యక్రమాన్ని పలువురు నేతలతో కలిసి శనివారం కంచిలిలో పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన గుర్చి స్మరించుకున్నారు. సమాజ గతిని మార్చేందుకు ప్రధానంగా సమానత్వాన్ని పెంపొందించడం అక్షరాస్యతను అభివృద్ధి సాధించడం, విద్యారంగంలో స్త్రీ శక్తిని మేల్కొల్పడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సమాజంలో పెను మార్పులకు పూలే కారణమయ్యారు అని అన్నారు. అటువంటి మహానుభావుని కృషి ఫలితంగా సమాజంలోని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు మార్కండేయులు, కుత్తుమ సుజాత, అనిల్ కుమార్ ప్రభాకర్ తిరుపతి చంద్రశేఖర్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

పలాస, ఏప్రిల్ 11(వార్త): మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి కార్యక్రమం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం పలాస నియోజకవర్గ కేంద్రంలోని మదర్ థెరీష పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ మాజీ కన్వీనర్ రామానంద స్వామి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమానికి జిల్లా ఓబీసీ ఐటీ కోకన్వీనర్ వమరవెల్లి శ్రీనివాసరావు నాయకత్వం వహించారు. సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ అంటరానితనం, అస్పృశ్యత నిర్మూలనకు పూలే కృషి చేశారన్నారు. స్త్రీలను విద్యావంతులుగా చేయడమే వారి యొక్క అభివృద్ధికి దోహదం చేస్తుందని, అటువంటి మహనీయుని స్మరించుకోవడం మన భాధ్యతని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వజ్జా భవాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు బైపల్లి ఈశ్వరి, మందస మండల అధ్యక్షులు తెలుకల సురేష్, మండల మాజీ అధ్యక్షులు పొందర దుదిష్టి పాత్రో, పలాస టౌన్ ప్రధాన కార్యదర్శి బోండా శ్రీనివాసరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పేరాడ యోగి, పాఠశాల మహిళా ఉద్యోగినులు పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.

రాష్ట్ర స్థాయి ఈఎండీపీ పోటీలకు నగరంపల్లి ప్రాజెక్ట్ బ్లూమ్ బ్యాగ్

పలాస, ఏప్రిల్ 11(వార్త): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంకు (ఈఎండిపి) ఎగ్జిబిషన్లో వజ్రపుకొత్తూరు మండలం, నగరంపల్లి - జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు కే. నీరజ, కే. చైతన్య, ఎన్. రిషిత్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో రూపొందించిన బ్లూమ్ బ్యాగ్ అనే ప్రాజెక్ట్ జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అర్హత సాధించాయి. శ్రీకాకుళం డిఈఓ ఏ. రవిబాబు, జిల్లా సైన్స్ అధికారి ఎన్. కుమారస్వామి, ఈఎండిపి జిల్లా మేనేజర్ అనూష నుంచి బహుమతిని అందుకున్నారు. ఈ విద్యార్థులు, మార్గదర్శి ఉపాధ్యాయులు శ్రీనివాసరావుని ప్రధానోపాధ్యాయులు టి. హేమారావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

నేరేడి బ్యారేజీ సమస్య పరిష్కారం ఆనందదాయకం

మందస, ఏప్రిల్ 11(వార్త): జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన నేరేడి బ్యారేజి సమస్య పరిష్కార దిశగా కీలక ముందడుగు పడినందుకు వంశధార సాగునీరు పోరాట సంఘం హర్షం వ్యక్తం చేస్తోందని సంఘం నాయకులు అన్నారు. హరిపురంలో గల మార్పు గ్రంధాలయంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వంశధార నేరేడు బేరేజి సమస్య పరిష్కరించిన సందర్భంగా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గత అర్ధ శతాబ్దకాలంగా ఆంధ్రప్రదేశ్-ఒడిశా రాష్ట్రాల మధ్య అంతర్రాష్ట్ర వివాదంగా కొనసాగుతున్న ఈ ప్రాజెక్టుకు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో పరిష్కారం దిశగా పురోగతి సాధించడం జిల్లా ప్రజలకు ఆనందదాయక పరిణామన్నారు. ఈ సందర్భంగా వంశధార సాగునీరు పోరాట సంఘం నాయకులు మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వం, కేంద్ర జలవనరుల శాఖ మంత్రులతో రామ్మోహన్ నాయుడు జరిపిన చర్చల ఫలితంగానే ఈ సమస్య పరిష్కారం దిశగా కదిలిందని కొనియాడారు. ఈ ప్రాజెక్టు సాధనకు సహకరించిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర జలవనరుల శాఖమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ సమస్య పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాలం అశోక్ బాబు, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చున్నాయుడు, రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానంలో భాగంగా వంశధార-బాహుదా నదుల అనుసంధానానికి రూ.6,432కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ సారథ్యంలో ఈ ప్రాజెక్టు పూర్తి అవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందడంతో పాటు ఉద్దానం ప్రాంత ప్రజల తాగునీటి సమస్యలు కూడా పరిష్కారం కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో వంశధార సాగునీటిని ఇచ్ఛాపురం వరకు అందించే బృహత్కార్యాన్ని స్థానిక ఎమ్మెల్యేలు చేపట్టి పూర్తి చేస్తే రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని సంఘం కోరింది. ఉత్తరాంధ్ర ప్రాంత జలవనరుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉండటం అభినందనీయమని సంఘం పేర్కొంది. అదేస్ఫూర్తితో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో అన్ని గ్రామాల పంటభూములకు నీరు అందించి రైతులు హృదయాలలో చిరస్థాయిగా నిలవాలని కోరారు. కార్యక్రమములో పాల్గొన్న పెద్దలు మజ్జి బాబురావు, అంపోలు త్రినాథరావు, కొర్నాన గంగారావు, నల్ల హడ్డి, వి.వి.ప్రసాద్, కొవ్వూరు దాశరథి, దేవాడ నారాయణ, వెదుళ్ళ మాధవరావు, శశిధరవర్మ, ధర్మార్పు వెంకటరావు. కొర్ల హేమారావుచౌదరి, మండల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ప్రజా దర్బార్ : శిరీష

పలాస, ఏప్రిల్ 11(వార్త): ప్రజా దర్బార్" పార్టీలకతీతంగా, పార్టీ రహితముగా నిర్వహిస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ప్రజల నుండి ప్రజా సమస్యలు తెలుసుకోనేందుకు పలాస ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గ్రీవెన్స్ శనివారం నిర్వహించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. పలాస నియోజకవర్గం, మందస, పలాస మున్సిపాలిటీ, వజ్రపు కొత్తూరు మండలం ప్రజలు ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు "ప్రజా దర్బార్" నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా పార్టీ రహితముగా "ప్రజా దర్బార్" నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే శిరీష కృషి పట్ల పలువురు అభినందించారు. మండలం నుండి 42 ఫిర్యాదులు రాగా ఆ పిర్యాదులు భూ వివాదాలు, రెవెన్యూ, రేషన్ డిపోతోపాటు రహదారుల సమస్యలు, విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు, ప్రధాన సమస్యలే ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. దీనితోపాటు రేషన్ కార్డులు కావాలని పింఛనులు కావాలని, ఇల్లు స్థలాలు కావాలని, గృహ నిర్మాణాలు చేపట్టాలని, వృద్ధులు వికలాంగులు, వితంతువులు, వ్యక్తిగత ఫిర్యాదులు అందాయి. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి ఈ సమస్యలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి పాలనలో భాగముగా టీడీపీ, బిజెపి, జనసేన, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీ పైపులకు నష్టం కలిగిస్తే చర్యలు

పలాస, ఏప్రిల్ 11(వార్త): వ్యవసాయ పొలాలు మార్గం ద్వారా పారాదీప్ నుంచి హైదరాబాద్ వరకు ఇండియన్ ఆయిల్ పైప్ లైన్ ఉందని, ఆయా ప్రాంతాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని పలాస తహశీల్దార్ టి కళ్యాణ చక్రవర్తి అన్నారు. పలాస మండలం కేదారిపురం గ్రామంలో శనివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేదారిపురం, కంబిరిగాం ప్రాంతాల్లో ఎక్కువగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, ఏ మాత్రం ఐఓసి పైపులు లీక్ అయ్యితే ప్రమాదం తప్పదన్నారు. ఐఓసి పైపులు ఉన్న పొలాల్లో మట్టి తవ్వకాలు చేపడితే సంబంధిత రైతు, జేసిబి పై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం విశాఖపట్నం ఐఓసి మేనేజర్ గణేష్ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తులను ఈ పైపులైన్ల ద్వారా అధిక పీడనంతో రవాణా చేస్తారని, పైప్ లైన్ పోవు మార్గంలో నూతులు, బోరు బావులు, చెరువులు, గుంతలు త్రవ్వకాలు చేయరాదన్నారు. పైప్ లైన్ పోవు మార్గంలో పెద్ద వేర్లు ఉన్న కొబ్బరి, మామిడి, నీలగిరి, పామ్ ఆయిల్, టేకు, చందనం చెట్లు నాటరాదన్నారు. గృహ నిర్మాణం, షెడ్, రోడ్డు విద్యుత్ స్తంభాలు నిర్మాణం చేయకూడదని చెప్పారు. అనధికారిక మైనింగ్, దొంగతనం, సిపెలైన్లకు నష్టం వంటి ఏదైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. చేసిన తప్పులు రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఏమైనా జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 18004252159, ల్యాండ్ లైన్ నంబర్ 9154355830 కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు మన్మధరావు, ప్రసాదరావు, ఐఓసి అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువత భవితకు భరోసా.. సేవాపథంలో జనసేన

ఇచ్ఛాపురం ఏప్రిల్ 11(వార్త): దాసరి బుజ్జి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్లు. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ పంపిణీ చేశారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గుర్తించి ఇచ్చినటువంటి రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ గౌరవ వేతనంతో ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఇచ్ఛాపురం జనసేన నాయకులు దాసరి రాజు ఏర్పాటు చేశారు. సేవ, రాజకీయం మేళవించి దాసరి రాజు ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజకీయం అంటే కేవలం ఓట్లు, ఎన్నికలు మాత్రమే కాదు, సమాజ మార్పు కోసం చేసే నిరంతర సేవ అని జనసేన పార్టీ నిరూపిస్తోందని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ పేర్కొన్నారు. దాసరి రాజు ఆధ్వర్యంలో, దాసరి బుజ్జి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన యువతీ యువకులకు శనివారం నాడు సర్టిఫికేట్ల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా కొరికాన రవికుమార్ మాట్లాడుతూ.. సేవ , రాజకీయం వేరువేరు కాదని, ఈ రెండూ కలిస్తేనే సమాజం బాగుపడుతుందని జనసేనాని పవన్ కళ్యాణ్ ఎప్పుడూ చెబుతుంటారనీ.. ఆ మాటలను అక్షరాలా నిజం చేస్తూ, దాసరి రాజు నియోజకవర్గంలో యువత కోసం ఉచిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని కొనియాడారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అనేది అత్యంత కీలకమని, యువత టెక్నాలజీ రంగంలో రాణించడమే లక్ష్యంగా ట్రస్ట్ చేస్తున్న కృషి వారి భవిష్యత్తుకు గొప్ప బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కామ్ టెక్ కంప్యూటర్స్ యాజమాన్యం అధినేత లమ్మత శైలజ కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం జనసేన నాయకురాలు కొరికాన భవానీ, పలాస మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోత పూర్ణ చంద్ర రావు, ఏ ఎం సి వైస్ చైర్మన్లు దాసరి శేఖర్, పెద్దింటి చందు,జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శులు తిప్పన దుర్యోధన రెడ్డి, నాగుల హరి బెహరా, కంచిలి మండల అధ్యక్షుడు డొక్కరి ఈశ్వరరావు, మున్సిపాలిటీ ఇంచార్జు రుక్మాంధర్, శ్యామ్ కళ్యా గౌడో, ప్రేమ్, కవిటి మండల అధ్యక్షులు అంగ సురేష్ కుమార్, సోంపేట మండల అధ్యక్షులు బీన ప్రదీప్, ఏఎంసీ డైరెక్టర్లు దుంగు భాస్కరరావు, బడే రాజు, పిఏసీఎస్ డైరెక్టర్లు బోగి డియా రాజశేఖర్, పాపారావు నియోజకవర్గ ముఖ్య నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



చక్రతీర్థ రహదారికి భూములివ్వండి

జలుమూరు, ఏప్రిల్ 11 (వార్త): శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాల రేవుకు వెళ్లే రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై నిర్వహించిన సమావేశం విజయవంతంగా పూర్తైంది. ఈ సమావేశం ఈవో కార్యాలయంలో తహసీల్దార్, ఆర్ఐ ఆధ్వర్యంలో జరిగింది. చక్రతీర్థ రేవుకు వెళ్లే మార్గంలో ఉన్న భూముల యజమానులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణం కోసం అవసరమైన భూముల వివరాలు, భూసేకరణ ప్రక్రియపై అధికారులు రైతులకు పూర్తి వివరణ ఇచ్చారు. తమ భూములకు సంబంధించిన సందేహాలను రైతులు నేరుగా ఈవో మరియు తహసీల్దార్‌తో చర్చించి నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, చక్రతీర్థ స్నానాల రేవుకు సౌకర్యవంతమైన రహదారి ఏర్పాటుతో భక్తులకు మెరుగైన రవాణా సదుపాయం కలుగుతుందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. రైతులు కూడా అభివృద్ధి కార్యక్రమానికి సహకరిస్తామని, అయితే తమ భూములకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశం ద్వారా భూసేకరణపై స్పష్టత కలగడంతో రహదారి నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

మహిళా సాధికారతే పూలేకు నివాళి

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): సామాజిక సమానత్వం కోసం పరితపించిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు విద్యావంతులు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో బీసీ భవన్ లో నిర్వహించిన పూలే 199 జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నాడు సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి, ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది దేశంలోనే తొలి బాలికల పాఠశాలను స్థాపించిన ఘనత పూలే దంపతులకే దక్కుతుందని కొనియాడారు. సభలో మహిళల భాగస్వామ్యం అధికంగా ఉండటం శుభపరిణామమని పేర్కొన్న కలెక్టర్.. స్థానిక భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్ నిధుల నుంచి తక్షణమే చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఈ భవనాన్ని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ.. విద్యావంతులైన సమాజమే పూలేకు దక్కే అసలైన గౌరవమని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.15,000 కోట్లు కేటాయించామని, కూటమి ప్రభుత్వం బీసీల కోసం రూ.1000 కోట్లతో ఆదరణ పథకాన్ని త్వరలో పునఃప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల ప్రయోజనాల దృష్ట్యా వివాదాస్పద జీవో 217ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జ్యోతిబా పూలే పాఠశాలలను 10o2 స్థాయికి పెంచామని, వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. దీనిలో భాగంగా రూ. 17.5 కోట్లతో హాస్టళ్లలో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు పనులు చేపట్టామని తెలిపారు. సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్న పూలే సిద్ధాంతానికి అనుగుణంగా ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినాయక రెడ్డి, శ్రీకాకుళం రెవిన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘం నాయకులు పాల్గొని పూలే చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

వైభవంగా నరసింహస్వామి జాతర

ఇచ్ఛాపురం ఏప్రిల్ 11(వార్త): ఈదుపురం గ్రామంలో నరసింహ స్వామి యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. ఈదుపురం బెహరా వీధిలోని నరసింహ ఆలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరు పెద్దలు భక్తులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 30 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ జాతర ఎంతో భక్తి శ్రద్ధలతో జరుగుతూ, ఈ ఏడాది కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊరు పెద్దలు హరిచంద్ర, రామచంద్ర, ముర, రఘు, హంగీర్ బెహరా, త్రిలోచన, మోహన్, ఈశ్వర, గణేష్, బన్నీ, నిరంజన్, బోనమాలి, మధు, తౌబిర, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

నరసన్నపేట ఆసుపత్రిలో ఆర్వో ప్లాంట్

- త్వరలో రోగులకు స్వచ్ఛమైన తాగునీరు

నరసన్నపేట, ఏప్రిల్ 11 (వార్త): నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో రోగులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు పనులు పూర్తికి చేరుకున్నాయి. ఆసుపత్రి ఆఫీస్ సూపరింటెండెంట్ కాళీ చరణ్ ఈ విషయాన్ని వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ, ఈ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు కోసం సుమారు రూ. 1.31 లక్షలు వెచ్చించామని తెలిపారు. ప్రస్తుతం పనులు చివరి దశలో ఉన్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే, సోమవారం ఈ ఆర్వో ప్లాంట్‌ను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ఆసుపత్రికి వచ్చే రోగులు మరియు వారి సహాయకులకు శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి రావడం వల్ల ఆరోగ్య పరిరక్షణకు మేలు జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ చర్య ప్రజా ఆరోగ్యానికి దోహదపడే ఒక ముఖ్యమైన సదుపాయంగా నిలుస్తూ, ఆసుపత్రి సేవల మెరుగుదలకు మరో అడుగుగా భావించబడుతోంది.

అసమానతల సమాజంలో ఉద్యమాలు అనివార్యం

-న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మాధవరావు

-ఘనంగా పైల16 వ వర్ధంతి

పలాస, ఏప్రిల్ 11(వార్త): అసమానతలు ఉన్న సమాజంలో ఉద్యమాలు అనివార్యంగా వస్తాయని, ఉద్యమాల్ని ఆపడం ఎవరి తరం కాదని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహయ కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. శనివారం పైల.వాసుదేవరావు 16వ వర్ధంతి సందర్భంగా వజ్రపు కొత్తూరు మండలం రిట్టపాడు లో పైల వాసుదేవరావు స్తూపం వద్ద 16 వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు జుత్తు వీరాస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముందుగా అమరవీరుల స్మారక స్థూపానికి పైల. వాసుదేవరావు సోదరుడు పైల రామారావు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మాధవరావు మాట్లాడుతూ అమెరికా ,ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం ఇరాన్ పై దురాక్రమణ యుద్ధం చేస్తుందని, ఈ యుద్ధం వలన భారతదేశంలో నిత్యవసర వస్తువులు ధరలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత ఏర్పడ్డాదని, గ్యాస్ కొరతను పాలకుల అధిగమించలేకపోతున్నారని విమర్శించారు. భారత పాలకులు ఖనిజ సంపదను దోచుకోవడానికి ఆపరేషన్ కగార్ పేరుతో వందలాది మందిని బూటకపు ఎన్కౌంటర్ పేర హత్య చేశారని ఆరోపించారు. ఆటవి సంపదను, ఖనిజ సంపదను సహజ వనరులను బహుళ జాతి కంపెనీలకు అప్పగించడానికి అటవీ సంరక్షణ నియమాలు చట్టాన్ని తీసుకువచ్చారని దుయ్యబెట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు తీర ప్రాంతంలో, ఏజెన్సీ ప్రాంతంలో లక్షలాది ఎకరాల భూములను సేకరించడానికి వివిధ ప్రాజెక్టుల పేరుతో రైతుల వద్ద బలవంత భూసేకరణకు పూనుకుంటుందని, రైతాంగం ప్రతిఘటించిన చోట వెనక్కి తగ్గుతుందని అన్నారు. కామ్రేడ్ పైలా వాసుదేవరావు ఆరు దశాబ్దాలు ప్రజల విముక్తి కోసం అవిరామంగా పోరాడిన యోధుడు, శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాట నిర్మాతల్లో ఒకరని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులని రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తారని గుర్తు చేశారు. ఈ దేశ విముక్తి కోసం 42 సంవత్సరాల అజ్ఞాత జీవితం గడపాలని ఆయన తన జీవితాంతం ఎక్కిపెట్టిన ఎర్రజెండా ఆయుధాన్ని ఎన్నడో దించలేదని ఆయన అమరుడ అయ్యేంతవరకు ప్రజల పక్షాన ఉద్యమమే ఊపిరిగా జీవించే అమరులయ్యారని, ఆయనతో పాటు అమరులైన పొందాల బాలకృష్ణ, పంచాది నిర్మల, సుబ్బారావు పాణిగ్రహి, తామడ గణపతి తదితర అమరుల ఆశయాలను ముందుకు తీసుకోవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాలని అన్నారు. ఈ సభలో అరుణోదయ సంస్కృత సమైక్య జిల్లా అధ్యక్షులు సౌర .రామారావు, కార్యదర్శి కె.సోమేశ్వరరావు, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు బతకల. ఈశ్వరమ్మ, పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల.వినోద్, పివైఎల్ జిల్లా కన్వీనర్ సారా.జగన్,రాపాక మాధవరావు, ఏఐకేఎంఎస్ నాయకులు మామిడి భీమారావు, వంకల పాపయ్య, పైలా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే



-ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఏప్రిల్ 11(వార్త): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబా పూలే అని, మహిళల విద్య, దళిత, బడుగు వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కొనియాడారు. జ్యోతిబా పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా పలాస టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే గౌతు శిరీష పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో సీఎం చంద్ర బాబు పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు లభించేలా ఎన్నో పథకాలు, ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీసీల విద్యకు ప్రాధాన్యమిస్తూ బీసీ హాస్టళ్లు, గురుకులాలను రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రతి బీసీ కుటుంబం నుంచి ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. జ్యోతిబా పూలే భారతదేశంలో సామాజిక సంస్కరణలకు పునాది వేసిన గొప్ప నాయకుడని, కుల వివక్ష, అజ్ఞానం, అసమానతలపై పోరాడుతూ, మహిళా విద్యకు, పేదల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అపారమైనవని ఆయన స్థాపించిన సత్యశోదక్ సమాజ్ ద్వారా సమాజంలో సమానత్వ భావనను పెంపొందించారని తెలిపారు. పూలే ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకాలని, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలి, సమాజంలో అందరికీ సమాన హక్కులు ఉండాలి అన్నది ఆయన బోధనల సారాంశం అని, ఈ సందర్భంగా ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ సమాజంలో సమానత్వం, సోదరభావం, న్యాయం స్థాపించేందుకు మనమందరం కృషి చేయాలని కోరారు. జ్యోతిబా పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంధాలయ చైర్మన్ పీరికట్ల విఠల్ , ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అఖిలభారత 90వ కిసాన్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

- రైతులకు మద్దతు

- ప్రభుత్వం వెంటనే స్పందించాలి

-కిల్లి కృపారాణి డిమాండ్

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో అఖిల భారత 90వ కిసాన్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోత మధుసూదన్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ కేంద్ర మంత్రివర్యులు కిల్లి కృపారాణి మాట్లాడుతూ, భారతదేశం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత దేశమని, దేశానికి వెన్నుముకైన రైతు ప్రస్తుతం కార్పొరేట్ విధానాలు మరియు ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్యల దిశగా నెట్టబడుతున్న పరిస్థితి ఆందోళనకరమని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన ఉత్పత్తులపై జీఎస్టీ విధించడం, పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకపోవడం వంటి అంశాలు రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. మొక్కజొన్న పంటకు గతంలో క్వింటాకు రూ.2400 ధర ఉండగా, ప్రస్తుతం అది రూ.1700కి పడిపోయిందని, ఎకరాకు సుమారు 40 క్వింటాళ్లు పండించే రైతులకు రూ.28,000 వరకు నష్టం వస్తోందని తెలిపారు. జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతుండటంతో రైతులకు రూ.200 కోట్ల వరకు నష్టం వాటిల్లుతున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రైతులకు సరైన ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సృష్టించగలరని, రైతును కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా నాయకులు సనపల అన్నాజీ రావు, కోత మధుసూదన్ రావు మాట్లాడుతూ, జిల్లాలో వివిధ పంటలలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. రత్నాల సోమశేఖర్, లంక కృష్ణ, నక్క చిరంజీవి, వాడరేవు సంపద రావు, గున్న దుర్యోధన రావు, సానా శంకరరావు, గురాడి మీనాక్షి, రొంగలి హరిబాబు తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిల్లి రామ్మోహన్ రావు, మంత్రి నరసింహమూర్తి, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, చింతాడ దిలీప్, రెల్ల సురేష్, మామిడి సత్యనారాయణ, అంబటి దాలినాయుడు, బద్రి సీతమ్మ, లఖినేని సాయిరాం, కూన రామారావు, తిర్రి శాంతారావు, పలపాల రమేష్ కుమార్, గొల్లపల్లి దాలయ్య, గుంట బారికా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం

-పాతకోట ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది

-పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష

మందస, ఏప్రిల్ 11(వార్త): కూటమి ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కలుగుతోందని, మారుమూల గిరిజన గ్రామమైన పాతకోట ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల పాతకోట అనే గిరిజన గ్రామానికి కొత్తగా బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బస్సు సౌకర్యం ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. పాతకోట గ్రామానికి పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష శనివారం ఆ గ్రామానికి కొత్తగా మంజూరైన బస్సు సర్వీసును జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో, విద్యార్థులు, రైతులు, అత్యవసర పనులపై మండల కేంద్రానికి వెళ్ళే ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఇటీవలే ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ప్రజల సమస్యపై తక్షణమే స్పందించిన ఆమె రవాణాశాఖ అధికారులతో మాట్లాడి, అతి తక్కువ సమయంలో గ్రామానికి కొత్త బస్సును మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌతు శిరీష మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఈ గ్రామానికి బస్సును తీసుకురావడం నాకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రతి గ్రామానికి ప్రభుత్వ ఫలాలను అందించడమే మా కర్తవ్యమని, ఇకపై ఈ గ్రామ ప్రజలు రవాణా కష్టాలు లేకుండా తమ పనులను సులభంగా చేసుకోగలుగుతారన్నారు.తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు, కూటమి ప్రభుత్వానికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి మహర్దశ.!

పలాస, ఏప్రిల్ 11 (వార్త): మున్సిపల్ పరిధి పెరగడమే కాకుండా 36 వార్డులుగా వికేంద్రీకరించబడుతూ సువిసాల రహదారులతో కూడిన మెరుగైన సౌకర్యాలతో ప్రజలకు భవిష్యత్తు, జనాభాను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్లాను అధికారులు రూపొందించడం జరుగుతుందని, మాస్టర్ ప్లాన్ కు తుది మెరుగులు దిద్దటానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో శనివారం మున్సిపల్ అధికారులు, సుడా అధికారులు చర్చించి ఈ నెలాకరికి పూర్తిస్థాయి అనుమతులతో అమలులోకి రాబోతుంది తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్, సుడా అధికారులు పాల్గొన్నారు.

జనాభా లెక్కలు కచ్చితంగా నిర్వహించాలి

సారవకోట, ఏప్రిల్ 11(వార్త): జనాభా లెక్కలను సక్రమంగా, కచ్చితంగా నిర్వహించాలని తహశీల్దార్ విజయలక్ష్మి సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులుగా కొనసాగిన జనాభా లెక్కల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సమాచారం సేకరిస్తారని, వారికి ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. జనాభా లెక్కలు ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, వనరుల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతాయని వివరించారు. అందువల్ల ఎన్యూమరేటర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించడంతో పాటు, విధుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జనాభా లెక్కలు సమగ్రంగా నిర్వహించడం ద్వారా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు బలమైన పునాది ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన

జలుమూరు, ఏప్రిల్ 11(వార్త): చల్లవానిపేట జంక్షన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. శక్తి టీంకు చెందిన పోలీసులు ఈ కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులకు వివిధ అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ మాట్లాడుతూ, చిన్నారుల రక్షణ కోసం రూపొందించిన చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే పెద్దలకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే, ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించకూడదని హెచ్చరించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో నగలు ధరించడం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని శక్తి టీం ఇచ్చిన సూచనలను శ్రద్ధగా విన్నారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంచడంతో పాటు, భద్రతపై జాగ్రత్తలు పాటించే దిశగా మార్గనిర్దేశం చేసింది.

డ్రగ్స్ వద్దు బ్రో గోడపత్రిక ఆవిష్కరించిన నేహా



శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): శ్రీకాకుళంలో ఓ నగల దుకాణం ప్రారంభోత్సవానికి విచ్చేసిన సినీనటి నేహా శెట్టితో జిల్లా పోలీసు శాఖ వారు “డ్రగ్స్ వద్దు బ్రో” , సంకల్పం, “నారీశక్తి” గోడ పత్రికలను శనివారం ఆవిష్కరింపజేశారు; ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గార పోలీసు స్టేషన్ ఎస్సై గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో పూలే జయంతి

నరసన్నపేట, ఏప్రిల్ 11(వార్త): నరసన్నపేటలో వైసీపీ కార్యాలయంలో శనివారం మహాత్మ మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు పాల్గొని, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం పూలే చేసిన సేవలను స్మరించారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆయన చూపిన మార్గం ఇప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఆరంగి మురళీధర్, బైరాగినాయుడు, జెడ్పీటీసీ చింతు రామారావు, రాజపు అప్పన్న, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి బంకుపల్లి లోకనాథం శర్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

ఘనంగా మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): సామాజిక సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి పురస్కరించుకొని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్ డీఎస్పీ డి.గోవిందరావు జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని కొనియాడారు.సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత మరియు సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకం

జలుమూరు, ఏప్రిల్ 11 (వార్త): సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ కోసం కృషి చేసిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని జలుమూరు మోడల్ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ ఐ. మాధవరావు తెలిపారు. శనివారం పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మెండ రామారావు మాట్లాడుతూ, అంటరానితనం నిర్మూలన, కులవ్యవస్థ వ్యతిరేక పోరాటంలో జ్యోతిరావు పూలే చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అలాగే, మహిళా విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తుచేస్తూ, బాలికల విద్య ప్రాధాన్యంపై విద్యార్థులకు వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ జ్యోతిరావు పూలే ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

నిధుల కొరతతో నాడు-నేడు పనుల నిలిపివేత

- జడ్పీ పాఠశాలలో అసంపూర్తిగా భవనాలు



నరసన్నపేట, ఏప్రిల్ 11 (వార్త): నరసన్నపేట జడ్పీ పాఠశాల (బోర్డు)లో నాడు-నేడు పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయాయి. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ పనులు పూర్తికాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలకు రూ.48 లక్షలు కేటాయిస్తూ అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించినప్పటికీ, కేవలం మూడు గదులు మాత్రమే పూర్తికాగా, మరో మూడు గదుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఈ విషయంపై పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, మొత్తం కేటాయించిన నిధుల్లో రూ.36 లక్షలు మాత్రమే విడుదల కావడంతో పనులు కొనసాగించలేకపోయామని తెలిపారు. మిగిలిన నిధులు విడుదల కాకపోవడం వల్ల నిర్మాణం నిలిచిపోయిందని వివరించారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే మిగిలిన నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యా రంగంలో కీలకమైన మౌలిక వసతుల అభివృద్ధి నిధుల కొరతతో నిలిచిపోవడం దురదృష్టకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పూడికలతో మూసుకుపోయిన కాలువలు

-నీటి కోసం 700 ఎకరాల రైతుల ఆందోళన



సారవకోట, ఏప్రిల్ 11(వార్త): సారవకోట మండలంలోని వంశధార ఎడమ కాలువ ఆయకట్టులో సాగు చేస్తున్న రైతులు ఈ వేసవిలోనైనా కాలువలు బాగుపడతాయా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో సాగు సాగుతున్నప్పటికీ, నీటి సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కివలస, కోదడ్డపనస, బద్రి, లక్ష్మీపురం గ్రామాలకు సమీపంలో వంశధార ప్రధాన కాలువ నుంచి విస్తరించిన చిన్న కాలువలు పూర్తిగా పూడికలతో నిండిపోయాయి. కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త కారణంగా నీటి ప్రవాహం సరిగా లేకపోవడంతో పంటలకు అవసరమైన నీరు అందడం లేదు. ప్రతి ఏడాది వేసవి కాలంలో పూడికలు తొలగిస్తామని అధికారులు హామీ ఇస్తున్నప్పటికీ, అమలు మాత్రం జరుగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అయినా కాలువల శుభ్రత పనులు చేపట్టి, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. రైతుల అభిప్రాయం ప్రకారం, కాలువలు సకాలంలో శుభ్రం చేస్తే నీటి వృథా తగ్గి, పంటల దిగుబడి కూడా పెరుగుతుందని అంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలువల పూడిక సమస్యను పరిష్కరించడం ద్వారా వందల ఎకరాల సాగు భూములకు ప్రాణాధారమైన నీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాధలు వింటూ.. భరోసా కల్పిస్తూ..!

- ప్రజా దర్బార్ నిర్వహించిన కేంద్ర మంత్రి రాము

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): శ్రీకాకుళంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని శనివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టారు. జిల్లా నలుమూలల నుండి వినతులతో ప్రజలు రాగా.. ఓపికగా వాటిని వింటూ పరిష్కార మార్గాలను రామ్మోహన్ నాయుడు సూచించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన గ్రీవెన్స్ కార్యక్రమం మధ్యాహ్నం 2 వరకు నిర్విరామంగా కొనసాగింది. భోజన విరామం అనంతరం 3:30 గంటలకు మళ్ళీ ప్రారంభమైంది. పార్లమెంట్ సమావేశాల కారణంగా గడిచిన కొద్ది రోజులుగా హస్తినకే కేంద్ర మంత్రి పరిమితం అవ్వడంతో శనివారం నాడు చేపట్టిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజలు పోటెత్తారు. ఉపాధి, బదిలీలు, ప్రభుత్వ సంక్షేమం, వికలాంగుల ఇబ్బందులు.. ఇలా తమ సమస్యలను కేంద్ర మంత్రి చెంతకు ప్రజలు చేర్చారు. అవసరమైనవాటికి అక్కడికక్కడే సంబంధిత అధికారుల చెంతకు చేర్చిన రామ్మోహన్ నాయుడు.. పరిష్కార దిశగా వాటిని మళ్ళించారు. శనివారం మొత్తం ప్రజా దర్బార్ కార్యక్రమానికి రామ్మోహన్ నాయుడు కేటాయించారు.

వైసీపీ హయాం స్వర్ణయుగం

-సచివాలయ వ్యవస్థ విప్లవాత్మక సంస్కరణ

-సర్పంచులే పవర్ ఫుల్

-మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే

- ఎవరూ అధైర్యపడవద్దు.. అండగా ఉంటా

-సర్పంచ్‌ల సన్మానసభలో మాజీ మంత్రి సీదిరి

పలాస, ఏప్రిల్ 11 (వార్త): భారతదేశంలో నాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ వ్యవస్థ కు నాంది పలికితే, వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్వర్ణ యుగంగా తీర్చిదిద్దిన ఘనత వైయస్సార్సీపి ప్రభుత్వాని దేనని రాష్ట్ర మాజీ మంత్రి, వైయస్సార్సీపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం పలాసలో వైయస్సార్సీపి ప్రగతి భవన్ ప్రాంగణం వద్ద పలాస నియోజకవర్గ పరిధిలోగల గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ లు మరియు పలాస- కాశీబుగ్గ పురపాలక సంఘం పాలకవర్గ సభ్యుల సన్మాన సభ జరిగింది. ఈ సన్మాన సభలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులను డాక్టర్ అప్పలరాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతిలో సర్పంచ్ పాత్ర కీలకమని, గ్రామాల బాధ్యతను చూసేది సర్పంచ్ దే నన్నారు. రాజకీయాల్లో పవర్ ఫుల్ పోస్ట్ పార్టీలకు అతీతంగా ఎన్నుకొనే ఒక్క సర్పంచ్ మాత్రమే అని డాక్టర్ అప్పలరాజు పేర్కొన్నారు. అధికారం లేదని ఎవరు అధైర్య పడాల్సిన పని లేదన్నారు. అందరూ ధైర్యంగా ఉండాలని, రానున్నది వైఎస్ఆర్సిపి ప్రభుత్వమే అని చెప్పారు. మళ్లీ సర్పంచ్ల ఎన్నికలు వస్తే కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో విజయం సాధిద్దామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చాక గ్రామపంచాయతీలను ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తూ, ప్రతిపక్ష వైయస్సార్సీపి కి చెందిన ప్రజా ప్రతినిధులను ఆ రాజకీయంగా అణచివేసే కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని తిప్పికొడుతూ, ధైర్యంగా పోరాడుతూ, ముందుకు కొనసాగుతున్న ప్రతి వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులతో పాటు నేతలు, కార్యకర్తలకు పార్టీ అధిష్టానం రుణపడి ఉందన్నారు. ప్రస్తుతం మనం పడుతున్న కష్టాలు జగనన్నకు తెలుసునని, ఈసారి అధికారంలోకి వచ్చిన వెంటనే అందర్నీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

వైయస్సార్సీపి ప్రభుత్వంలో గ్రామపంచాయతీ లలో అనేక విప్లవాత్మమైన సామాజిక సంస్కరణలు తీసుకురావడం జరిగిందని, అందులో భాగమే గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకురావడం జరిగిందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ లు, మంచినీటి చెరువుల అభివృద్ధి, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం లో ఏ సర్పంచ్ పై ఎటువంటి అవినీతి ఆరోపణలు రాలేదని, వారంతా పారదర్శకమైన పరిపాలన అందించడం వల్ల వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్సిపి బలపరిచిన అభ్యర్థులే సర్పంచులుగా విజయం సాధిస్తారన్న ధీమా ఆయన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఐదేళ్లు ప్రజా సేవ చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా మన్నారు.

గ్రామపంచాయతీలో ప్రజలకు చేసిన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోతాయన్నారు. వైయస్సార్సీపి హయాంలో కోవిడ్ లాంటి సంక్షోభం వచ్చిన గాని ప్రజలకు సేవలు అందించడంలో పాలకవర్గాలు, అధికార యంత్రాంగం ప్రజల ప్రశంసలు అందుకోవడం జరిగిందన్నారు. ఏ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైయస్సార్సీపి శ్రేణులు సిద్ధంగా ఉండాలని డాక్టర్ అప్పలరాజు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తొలుత మున్సిపాలిటీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అన్నారు. కాబట్టి మున్సిపాలిటీలో వైయస్సార్సీపి నిత్యం ప్రజలతో మమేకం కావాలని, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడమే గాక, ప్రజలను చైతన్య పరుస్తూ, వైయస్ఆర్సీపి అధిష్టానం చేపట్టే పోరాట ఉద్యమాల లో ప్రజలను కూడా భాగస్వామి చేసే విధంగా అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు హనుమంతు వెంకట్రావు దొర, జడ్పీ వైస్ చైర్పర్సన్ పాలిన శ్రావణి శ్రీనివాస్ యాదవ్, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ యాదవ్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, వజ్రపు కొత్తూరు ఎంపీపీ ప్రతినిధి ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్ కుమార్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, వైఎస్ఆర్సిపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, వైయస్సార్ సిపి పలాస నియోజకవర్గ రాజకీయ పరిశీలకులు ఎన్ని ధనుంజయ రావు, సీనియర్ నేత పొన్నాడ రుషి, వైఎస్ఆర్సిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ, వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నేతలు దువ్వాడ రవి, తిర్రి రాజారావు, డి. జానకి రెడ్డి, వైఎస్ఆర్సిపి యువజన నేతలు సేనాపతి కిషోర్, సిందిరి జగన్, కర్రి గోపాల్, సురేష్ పాణిగ్రహి, సుజాత పండ, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వైయస్సార్సీపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కత్తిరి వెంకటరమణకు రాష్ట్ర స్థాయి గుర్తింపు.. ఘన సత్కారం

నరసన్నపేట, ఏప్రిల్ 11 (వార్త): సారవకోట మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కత్తిరి వెంకటరమణ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం పార్టీ కార్యకర్తలకు ప్రేరణగా నిలిచింది. మై టీడీపీ యాప్ ద్వారా రాష్ట్ర స్థాయి టాప్-10 కార్యకర్తల్లో స్థానం దక్కించుకున్న వెంకటరమణను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఘనంగా సత్కరించారు.

మంగళగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా సత్కారం అందుకున్న వెంకటరమణను, అనంతరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించారు. సాలువాతో సత్కరించి ఆయన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెంకటరమణ చేసిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం ప్రతి కార్యకర్తకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ఇలాంటి కృషిశీల నాయకులు అవసరమని ఆయన స్పష్టం చేశారు. వెంకటరమణ తన ప్రసంగంలో, మై టీడీపీ యాప్ ద్వారా కార్యకర్తలకు అవకాశాలు కల్పించిన మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలను ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం పెరుగుతుందని, పార్టీ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయి నాయకులు, పిఎసిఎస్ చైర్మన్లు, క్లస్టర్ ఇంచార్జులు, మాజీ సర్పంచులు, డైరెక్టర్లు, అనేక మంది కార్యకర్తలు పాల్గొని వెంకటరమణకు అభినందనలు తెలిపారు.

సామాజిక సమానత్వానికి పూలే స్ఫూర్తి

నరసన్నపేట, ఏప్రిల్ 11 (వార్త): అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళా విద్య మరియు సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నరసన్నపేటలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు మరియు మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు చిత్రపటాలకు కూడా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే గారు సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళా విద్యాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు అపారమని కొనియాడారు. ఆయన ప్రారంభించిన విద్యా ఉద్యమం సమాజంలో కొత్త మార్పులకు దారి తీసిందని, ముఖ్యంగా బాలికల విద్యకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం సాధించేందుకు ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అలాగే, బీసీల సంక్షేమం మరియు అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలు సామాజిక న్యాయం మరియు సమానత్వంపై ఆధారపడినవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు.



సైన్ లాంగ్వేజ్‌తో.. బధిరులకు భరోసా

: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

- సైన్ లాంగ్వేజ్ పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి.

- ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలని పిలుపు.

శ్రీకాకుళం, ఏప్రిల్ 11 (వార్త): బధిరులతో మాట్లాడేందుకు ప్రత్యేకంగా రూపొందించిన సైన్ లాంగ్వేజ్ ను అందరూ నేర్చుకుని.. మనం తోడున్నామనే భరోసాను వారికి ఇవ్వాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ సందర్భంగా చెవిటి, మూగ వారితో సంభాషణకు వీలుగా ఉండే చేతి సంజ్ఞల భాష సైన్ లాంగ్వేజ్ గోడ పత్రికను శనివారం నాడు ఆయన ఆవిష్కరించారు. ఇంగ్లీషు అక్షరాలతో పాటు, నిత్యావసరాలను తెలిపే చేతి సంజ్ఞలను పోస్టర్ రూపంలో ఏర్పాటు చేశారు.. ఇందులో ఏ నుండి జెడ్ వరకు సంజ్ఞల రూపంలో ఉంటాయి. ఇందులో ఒక్కో అక్షరాన్ని ఒక్కో ప్రముఖ వ్యక్తి తెలియపరుస్తూ పోస్టర్ ఉండగా.. "ఏ" అక్షరాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలుపుతూ ఉన్న చిత్రపటాన్ని పోస్టర్ లో ఏర్పాటు చేశారు. సులభంగా నేర్చుకునే ఈ సైన్ లాంగ్వేజ్ ను ప్రజలందరూ నేర్చుకుని బధిరులకు తామున్నామనే భరోసాను అందరూ అందివ్వాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ భాష నేర్చుకోవడం ద్వారా వారితో సంబంధాలు కూడా మెరుగుపడతాయని, అత్యవసర పరిస్థితుల్లో ఉపయుక్తంగా ఉంటుందని రామ్మోహన్ నాయుడు అన్నారు. గోడ పత్రిక ఆవిష్కరణ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలోని బధిరుల అసోసియేషన్ ప్రతినిధులు రామ్మోహన్ నాయుడు ను కలిసి తమ ఇబ్బందులు తెలియజేశారు. ఉపాధి, గృహాలు, గృహాలకు లోన్లు వంటి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అడ్వైజర్ నర్మజ, ప్రతినిధులు సురేష్, దేవి, కిరణ్, ప్రసాద్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546